తెలుగు మాస్టారు (నవలిక)

శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం

తెలుగు మాస్టారు—పిల్లలకి లోకువ.

ఫరవాలేదు. పిల్లలూ దేముడూ చల్లనివారే. తెలుగు మాస్టారికి సహనం అనంతం, అపరిమితం. ఆయన – పిల్లల్నీ క్షమించగలరు, దేముణ్ణయినా క్షమించగలరు.

తెలుగు మాస్టారు—జీవితానికీ లోకువే!

ఇది—బహు బాధాకరమ్.

కలం విసురుకొద్దీ—మీ గుండెలలో గునపాలు గుచ్చాలనికాదు మాస్టారూ!...నిజంగా...మనస్ఫూర్తిగా ... హృదయాంతరాలనుంచీ ఉబికి వస్తున్న సానుభూతిని—మీ కందజేయాలనే నా తపన. కు రతనం అయితే—క్షమించెయ్యండి మాస్టారూ! మీరెందరిని క్షమించలేదు!

1

సాధారణంగా తెలుగు మాస్టర్లందరూ ఒకేలా ఉంటారు. ఫ్యామిలీ ప్లానింగ్ రోజులలో కూడా గంపెడు సంతానమూ, అరిగిపోయిన చెప్పులు (ఉంటే)-సదా చేతిలో గొడుగూ (కుట్లూ, మాసికలూ ఉంటాయి. శ్రమపడి వెదికితే ఓ మూల-మాస్టారి పేరు కూడా కనిపించవచ్చు గొడుగు గుడ్డమీద) – మరొక చేతిలో సంచీ. (చవక రకానిదే. రోడ్డుపక్క చవగ్గా దొరికితే కూరలు కొనుక్కుని స్కూలుకయినాసరే వెంటపెట్టుకు వెళ్లేందుకు)—మాసిన, నలభయ్యో నంబరుదో, అరవయ్యో నంబరుదో ఖద్దరుపంచె - పొడుగు చేతుల—కంటిమెడ చొక్కా-చామన చాయ-సుమారయిన ఎత్తు-వడిలిపోయిన శరీరమూ-నూటికి తొంభై ఎనిమిదిమంది తెలుగు మాస్టార్లింతే. మిగిలిన యిద్దరూ-తెలుగు మాస్టార్లు కాజాలరు.

మన ప్రాచీన సంస్కృతికి—చిహ్నం తెలుగు మాస్టారు. కాలం మారినీ, తెలుగు మాస్టారు మారరు.

వారి స్థానం—సమాజపు తీరుతెన్నులతో నిమిత్తం లేకుండా—సుస్థిరం.

సుడిగాలి—గడ్డిపోచలని ఏమీచేయదు.

సంఘం-తెలుగు మాస్టారి జోలికిపోదు. కయ్యానికయినా, వియ్యానికయినా ఉజ్జీ కుదరాలికదా?

తెలుగు మాస్టారి హృదయంలోకి చూడగలిగితే – నవనీతమో, మంచిగంధమో తప్ప మరేమీ కనిపించదు. అందుకే అనిపిస్తుంది—తెలుగు మాస్టార్లు—పిల్లలే అని.

తెలుగు మాస్టారు-పిల్లలకి చక్కని తండ్రి.

కోప్పడ్డం ఎరగని శాంతమూర్తి. అందుకే పిల్లలకి ఆయనంటే అతి చనువు.

అర్ధాంగికి మాత్రం ఆయనంటే మహా అలుసు.

తెలుగు మాస్టార్లందరూ అపర సోక్రటీసులే ఏమో!

ఒక్కముక్కలో చెప్పాలంటే - తెలుగు మాస్టారు — మరో

ఏసుప్రభువు!

ఎంత అమాయకత్వం!

బదిలీచేస్తే-ఊరొదిలి పోడమేతప్ప—ఎవరినో ఆశ్రయించి తన స్థానాన్ని నిశ్చలం చేసుకోడం చేతకాని తెలుగు మాస్టారు! నాగరికత ఎంత విజృంభిస్తున్నా - పేకముక్కలు పట్టుకోడం నేర్చుకోరే! ఎప్పుడేనా ఏ చదరంగమో, సమస్యా పూరణమో! పేకముక్కలతో బేస్తులాట కాకుండా యింకా చాలా ఆడుకోవచ్చునంటే - మందహాసం చిందించి ఊరుకుంటారు.

చెప్పడం మరిచాను.

ప్రాచీన సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తెలుగు మాస్టారికి—తప్పకుండా పిలక ఉండితీరుతుంది. ఆ పిలకలో—మందారపువ్వో, తులసిదళమో చోటు చేసుకుని తొంగి చూస్తూనే ఉంటుంది.

నవ్విపోదురుగాక నాకేటి చేటు.

పిల్లలూ పెద్దలూ, నాగరికతా ఏకమై - నవ్వినా తెలుగు మాస్టారు కించిత్తయినా చలించరు.

నవ్విన నాపచేను—పండాలి.

కాని—పండదు! ఎండిపోతుంది.

ఈ-ఐరనీ ఆఫ్ లైఫ్-ప్రతి తెలుగు మాస్టారినీ ఆట లాడించి చివరకు చిత్తుగా ఓడించి వదులుతుంది.

అందుకే-తెలుగు మాస్టారంటే నాకు జాలి.

జీవితానికి తెలుగు మాస్టారంటే ఎందుకు జాలి ఉండదో? అది కూడా ఆయన పాలిటి హెడ్‌మాస్టరయి కూర్చుంటుందేం? ఎంత శోధించినా యీ ప్రశ్నలకు సమాధానం రాబట్టుకోలేక పోయాను.

2

తెలుగు మాస్టారికీ-కోరికలుంటాయి!

విచిత్రమైన కోరికలు! చిన్న పిల్లల కోరికలు!!

మా తెలుగు మాస్టారికీ చిన్నకోరిక ఒకటుండేది. ఇదీ ఓ కోరికేనా అని నవ్వుకుంటే నేనేమీ చెప్పలేను కాని-నిజంగా, మా తెలుగు మాస్టారికి-హోటల్లో టిఫిన్ తినాలని కోరికుండేది. కోరికలు ఖరీదైనవే అయి ఉండాలని నియమమేముంది? అయినా-వింతవెట్టి కొంతగాలి!

హోటల్లో టిఫిను తినడం-తెలుగుమాస్టారి జీవితానికి కోరికే. ఎప్పుడో ఓసారి – పాఠంమధ్యలో – తెలుగు మాస్టారు – శ్రీనాథుడి భోజనం గురించి చెప్తూ-హోటలు టిఫిన్ గురించి ప్రస్తావించారు. వారి మాటలలో...

"పాల్‌ఘాట్ అయ్యరెంత బాగుంటాడ్రా, విభూతి పండులా! ఎంతశుచి! ఎంత శుభ్రం!... పళ్ళాల్లో లేత అరిటాకులు వేసి మరీ ఫలహారం యిస్తారటగా? ఒరేయ్... లేత అరిటాకుమీద తినే ఫలహారానికి కొత్తరుచి వస్తుంది. తామరాకుమీద ఒకలా, మోదుగాకుమీద మరొకలా, లేత అరిటాకుమీద యింకొకలా, రుచి మారుతుంది అదే ఫలహారానికి. అయ్యర్లు నీతి నియమాలుకల మనుషులు. వాళ్ళిచ్చే యిడ్లీలు జున్నుముక్కలేనట. ఆ సాంబారు – రోడ్డు మీదకే ఘుమఘుమలాడుతుంది. అయ్యరు హోటల్లో ఆరడజనిడ్లీలు తినని జీవితం దేనికిరా?"

ఒక కొంటె కుర్రాడు లేచి– "మీరెప్పుడూ ఆ హోటల్లో టిఫిన్ చేయలేదా మాస్టారూ?" అంటూ అడిగాడు.

"లేదురా–" ఎంతో నిరాశగా, దీనంగా – దాదాపు గద్గదిక స్వరంతో చెప్పారు మాస్టారు.

"నేనురోజూ డజనిడ్లీలు తింటూంటాను మాస్టారూ! –" ఊరించాడు కుర్రాడు.

మాస్టారి ముఖంలోని భావాలను వివరించడానికి ఏభాషా చాలదు. తెలుగు మాస్టారు చెప్పే ఛందస్సంత జటిలంగానూ ఉందా యన భావ ప్రకటన.

భోజరాజుని చూసిన వారికి కవిత్వం వచ్చేదంటారు.

నాకు నమ్మకం అట్టేలేదు. కాని –

మా తెలుగు మాస్టారిని చూసిన కుర్రాళ్ళందరికీ – జోకులు తెగ ఊరిపోయేవి. ఇది పచ్చినిజం.

మాస్టారు—నరసులు కాకపోలేదు. అయితే – అమాయకుల్ని పట్టుకుని-ఎంత చిన్నతనం ఐతే మాత్రం-ప్రాక్టికల్ జోకులు వేస్తే ఎలా?

అకొంటె వెధవ– (నాకు మాస్టారిమీద జాలి కనుక, వాడి మీద కోపం వచ్చింది) ఏం చేశాడంటే...

రోడ్డుమీద–గొడుగు పట్టుకుని నడుస్తున్న తెలుగు మాస్టార్ని చూపి-ఎక్కడలేని భయ భక్తులూ వొలికించి – (మాస్టారు మంచి వారు. ఎదుటివాడిది నటనో నిజమో బేరీజు వేయకుండా నమ్మేసే-కల్లాకపటం ఎరుగని అమాయక మూర్తులు)

"ఇడ్లీలు తిన్నప్పుడల్లా మీరే గుర్తుకొస్తూంటారు మాస్టారూ. అంతే-యిక గొంతు దిగదు ఫలహారం. నాతోవచ్చి – మదర్పిత ఇడ్లీ కాఫీలను సుష్టుగా స్వీకరించి – నన్నానందింపజేయగోరు చున్నాను. భవదీయ శిష్యపరమాణువు." అంటూ మాస్టారి కాళ్ళా వేళ్ళా పడ్డాడు.

అసలే కరుణామయుడైన తెలుగు మాస్టారు కాదనలేక పోయారు. కాళ్ళు మొరాయిస్తున్నా – (ఆ రాత్రికి-యింట్లో కూర లేదని ఆయనకి నిశ్చయంగా తెలుసు. తన జేబులో చిల్లికానీకూడా లేదనీ, జేబుకి చిల్లి మాత్రమే ఉందనీ తెలుసు. అర్ధాంగినీ, బిడ్డలినీ అకలికి వదిలి – తాను ఇడ్లీ కాఫీలు – అయ్యరు హోటలులో ఆరగించడం-పంచమహాపాతకాలలోనూ ఒకటిగా ఆయన కనిపించడం అతి వాస్తవం. కానీ-శిష్యుడు! వాడి వేడికోలు!) కుర్రవాడి వెంట కదిలాడు.

ఇడ్లీలుతింటూ పారవశ్యంలో మునిగిపోయారు మాస్టారు.

ఆ సాంబారు—అలనాటి–వర్ణనలలోని అమృతంకంటె మిన్నగా భాసించుచుండగా—ద్రాక్షాపాకమూ, కదళీపాకమూ తలుచుకుంటూ, పద్య కవితలో సాంబారు పాకం ఏల ప్రవేశింప జేయలేదు? అని ఆత్మగతంగా విమర్శించుకుంటూ—క్రొంజిగురు రరటి యాకులలో ఆరడజనిడ్లీలు-కొన్ని నేతితో, కొబ్బరి చెట్నీతో, మరికొన్ని (సరసి తలమున తేలియాడు తెల్లితామరలను సరిపోలు) యిడ్లీలను సాంబారుతో సేవించి-కాఫీ పుచ్చుకుని-గొంతునిండా త్రేన్చినవారై – పారవశ్యము నుండి తెప్పరిల్లి-వాస్తవ ప్రపంచములోనికివచ్చి–కనులువిప్పిచూడగా–

తనని తీసుకు వచ్చిన కుర్రాడికోసం చూశారు.

ఆ కుర్రవాడు—అంతర్ధానమైన విషయం— ఐదు నిముషాలకి కానీ ఆయనకి అర్థం కాలేదు.

అర్థం అయ్యాక-ఆగ్రహం తెచ్చుకోవచ్చునన్న మాటేమరచి-నిస్పృహోయుడై-బిత రిచూపులుచూస్తూ-కరి, మొసలిబాధను భరించ లేక విష్ణువుని ప్రార్థించే ఘట్టాన్ని (పదువుడు-గజేంద్రమోక్షము) మననంచేసుకుంటూ (రాగ యుక్తంగా) కుర్చీకీ బల్లకీ మధ్య చిత్రంపులా నిలచి - పైచూపులు చూడసాగరు, పరమాత్ముడు వచ్చి రక్షించడా అని!

పరమాత్ముడు - రాడు.

వచ్చినా-రోడ్డుపక్క సాంబారు హోటళ్లలోకి అసలురాడు.

తప్పని సరైవస్తే - కౌంటరుదాటి అరంగుళం జరగడు. మాస్టారి ముందుకువచ్చినవాడు —

పర్మేశ్వరుడు ఎంతమాత్రమూకాదు.

పర్యరేశ్వరుడు!

చేతిలోబిల్లు - మాస్టారి బల్లమీద అంటించేశాడు నీటి చుక్కతో.

తిన్నతిండికి — ఖరీదు కట్టడం — మాస్టారి మనసు చివుక్కు మనకపోలేదు. కాని—ఏం చేయగలరు?

అలవైకుంఠపురంబులో, నగరిలో నామూల సౌధంబులోపల—వెదుకుతున్నట్లు మాస్టారి దీననయనాలు తన శిష్యుడి కోసం వెదుకులాడాయి. శిష్యుడు కనిపించలేదు. ఆశాభంగం ఐంది.

హోటల్ సప్లయర్ కికూడా అనువేనా తెలుగుమాస్టారు?

"వెళ్ళి-బిల్లు చెల్లించండి-" కుర్చీ కాళీచెయ్యమన్న శ్లేష ధ్వనించింది మాస్టారికి.

చేతిలో గొడుగుతో కదిలాడు.

చిత్తము చిడిముడివడ, తడబడు వడలితో— తలవంచుకుని —కౌంటరువద్దకు చేరి-

దీన, పరిదీన దృక్కులతో అయ్యరు ముఖంలోకి చూడలేక చూస్తున్నవారై—ఆపాదమస్తకమూ చిరుచెమటలు క్రమ్ముకుంటూండగా—

గొడుగు అయ్యరుముందు పెట్టి—

"నన్ను తీసుకువచ్చిన కుర్రాడు కనిపించడంలేదు. హటాత్తుగా ఏం పని తగిలిందో ఏమో! ఈ గొడుగు ఉంచండి. ఎక్కడేనా అప్పుచేసి— బిల్లు చెల్లించి— గొడుగు తీసుకుంటాను."

అన్నారు మాస్టారు.

బిల్లులు వసూళ్లతో ఊపిరాడని అయ్యరు-క్షణకాలం వారిని పరికించి—"అవసరంలేదు. గొడుగు తీసుకువెళ్ళండి—" అన్నాడు.

అనూయకమ్మేస్టారికి అయ్యరు మాటలర్థం కాలేదు.

అపార్థాలయ్యాయి.

గొడుగు—పాతదే కావచ్చు.

కుట్లుపడే ఉండవచ్చు. కాని—

ఊచలు బాగానే ఉన్నాయి. కర్ర బాగానే ఉంది. అంతా కలిసి ఒకరూపంలోనూ ఉంది. ఈ గొడుగు—అర్థరూపాయ చేస్తుందా, చెయ్యదా అని కాదు. అర్థరూపాయికి—హామీగా నిలవదూ? తన పదవీ, పరువూ — బొత్తిగా పూర్ణానుస్వారమేనా? ఇప్పుడు ఇక్కడ—తన మొరాలకించు వాడెవడు?

అవమానభారంతో, మరింత అవనత శిరస్కులై నిలిచి పోయారు.

కుర్రవాడు కనిపించనేల?

కనిపించెను పో,

హోటలుకు పిలువనేల?

పిలిచెను పో,

తాను రానేల?

వచ్చెను పో,

యిటుల జరుగనేల?

అని పరిపరివిధముల చింతించుచున్న మాస్టారినంత — హోటల్ ఘూటయ్యరు—వరమిచ్చు వేల్పు భక్తునివంక చూచు భంగిమ నభివ యించి ప్రకాశముగా యిట్లనియె:

"మాస్టారూ! మీరు నాకు తెలిసినవారే. మా అబ్బాయి మీ శిష్యుడు. మీరు బిల్లు చెల్లించనవసరంలేదు. గొడుగు తీసుకుని వెళ్ళండి."

మాస్టారి ఆశ్చర్యాని కంతులేకపోయింది.

అంతటి అయ్యరుకి—తెలుగు మాస్టారు తెలియడమా!

తెలిసినా—యింత మర్యాదగా మాట్లాడడమా!!

చివరకి—బిల్లు వద్దకూడా మొహమాటమూ, దయా ప్రదర్శించడమా!!! అయ్యరూ దేముడూ అతికరుణామయులు.

అనుకుంటూ—కృతజ్ఞతాపూర్వకంగా అయ్యరువంక చూపి -కదిలారు.

నన్నాశ్చర్యపరిచింది—జరిగిన సంఘటన ఏంతమాత్రమూ కాదు. ఆ సంఘటనను చెప్పినతీరు!

ఈ వృత్తాంతాన్ని చెప్పినది తెలుగు మాస్టారు!

మందహాస వదనారవిందంతో—

ఉండి ఉండి పొడుముపట్టు దట్టిస్తూ—

ఒక రసవత్తర సన్నివేశాన్ని వర్ణించినంత శ్రద్ధగా చెప్పారే కాని—

ఆ సన్నివేశంలో తనపాత్ర దయనీయమైనదని కాని—

ఆ కుర్రాడిమీద కోపపడుతూ కాని—

చెప్పలేదు.

భగవంతుని లీలలలో ఒకదాన్ని వర్ణించినట్లే దీన్నీ అతి గౌరవంగా కథనం చేశారు. ఒక పాత్రమీద కోపమూ ప్రకటించలేదు, మరొక పాత్రమీద అసహ్యమూ ప్రకటించలేదు.

నానృషిః కురుతే కావ్యం.

కథా కథనాన్ని—ఆత్మకథా కథనాన్ని కూడా రుషితుల్యులై—నిష్పక్షపాతంగా నెరవేర్చగలిగిన తెలుగు మాస్టారూ, మీరు మహర్షులే. మరో వాల్మీకులు!

తెలుగు మాస్టారి జీవితంలో అతి చిన్నకోరిక కూడా తీరకనే మిగిలిపోతుందనడానికి—మరొక్క సంఘటన చెప్పి ముగిస్తాను.

కోరిక తీరడమూ కాదు, తీరకపోవడమూ కాదు.

సుష్టుగా భోజనం పెట్టి—తేన్పబోతూంటే—హృదయం దహించే మాటలు వినపడటమో, మనసు కుమిలిపోయే సంఘటనో జరిగితే—కోరిక తీరినట్టెలా ఔతుంది?

తృప్తి అనేది చాలాచోట్ల—రెండుదశల వ్యవహారం.

మొదటిది శారీరకమూ, రెండవది మానసికమూ.

కోరిక తీరిన అనుభూతిని పొందాలంటే —

బాహ్యేంద్రియాలూ, హృదయమూ రెండిటికీ సమన్వయం కుదరాలి జిలేబీ నోటిలోకి వెళ్ళినంతమాత్రాన కోరిక తీరిపోదు. మనస్సుకి తాకి-అది ప్రకంపించాలి. అప్పుడే నిజమయిన అనుభూతి. అదే పరిపూర్ణ రసాస్వాదన.

రసనేంద్రియాలూ, హృదయమూ తుష్టి చెందితే తప్ప అనుభూతి అసంపూర్ణమే!

వ్యాఖ్యానం అటుంచి- కథలోకి పోదాం.

పై సంఘటన జరిగిన కొన్ని దశాబ్దాలకు-ఆకోణంలో మరో సంఘటన జరిగింది. పరాకాష్ఠ నందుకుంది.

విశాఖపట్నం-నాగరికతకు నిలయం.

అక్కడ హోటళ్ళలో సర్వర్లూ, క్లీనర్లూకూడా. ఇంగ్లీషే మాట్లాడతారు. ఇంగ్లీషు మాట్లాడేవాళ్ళనే మనుషులుగా గుర్తించి గౌరవిస్తారు. ఇంగ్లీషు మాట్లాడనివాళ్ళు వాళ్ళ దృష్టికి ద్విపాద పశువులే ఏమో!

టిఫిను తింటున్న నేను త్రుళ్ళిపడ్డాను.

నాముందు రెండు టేబుల్స్ అవతల గలాటా అనలేను కానీ—కొంచెం చెడిన పరిస్థితి-నెలకొంది.

అవమానకరమైన ఆ సంఘటనలో చిక్కుకున్నవ్యక్తి - తెలుగు మాస్టారేఅని అనుమానం కలిగేసరికి, వెళ్ళకుండా ఉండలేకపోయాను.

సందేహంలేదు.

మాస్టారే. తెలుగు మాస్టారే. మా తెలుగు మాస్టారే.

కొంచం కంపిస్తూ నిలుచున్నారు.

నన్నుచూసీ గుర్తించలేదు.

జరిగినది - విన్నాను.

మాస్టారు రెండిడ్లీ చెప్పారు.

ఒకటి తినేసరికి — పచ్చడి మిగలలేదు పచ్చడి తెమ్మని సర్వరుకిచెప్పి-ఊరికే కూర్చోలేక—మిగిలిన యిడ్లీని చిరు చిరు భాగాలు చేసి ఉంచుకున్నారు కాలాన్ని దుర్వినియోగం చేయకుండేనికని.

ఇంకారాలేదు పచ్చడి.

కుర్చీలో వెనక్కివాలి—గోడమీద సాక్షాత్కరిస్తున్న అర్ధనగ్న అమ్మాయి క్యాలెండరువిమాస్తూ — [illegible] వరూధిని యింత నగ్నంగా సౌందర్య ప్రదర్శన గావించి ఉంటుందా అన్న పరిశోధనలోపడి పోయారు.

తెలివి వచ్చేసరికి—

పచ్చడి రాలేదు.

ఇడ్లీ ప్లేటు క్లీనరు తీసుకుపోతున్నాడు.

"అబ్బాయ్!—" పిలిచారు మాస్టారు.

క్లీనరుకి కోపంవచ్చింది. "అబ్బాయేమిటి? మిస్టర్ అనలేవూ?" ఎదురు తిరిగాడు.

మాస్టారికి కోపం రాలేదు. అవిధేయత సహించలేకపోయారు. పెద్దలను గౌరవించడంచేత కానందుకు క్లీనరుమీద విసుక్కున్నారో, తల్లివంటి మాతృభాషని వదిలి—పరకాంతవంటి ఆంగ్లభాష నాశ్రయిస్తున్నందుకు జాలిపడ్డారో!

"ఫలహారం పూర్తి చేయకుండానే పళ్ళెం తీసుకుపోతావేం?"

"దిక్కులు చూస్తూంటే- యింక తినవేమో అనుకున్నాను. గోడమీద బొమ్మలో లడ్డూలుచూస్తూ—లోకం మరచిపోతే నాదా తప్పు?"

పిగ్గు పడిపోయారు మాస్టారు.

సాధారణంగా వయస్సుకి గౌరవం లభిస్తుంది.

తెలుగుమాస్టారి విషయంలో—ఆ రూలూ వెక్కిరించింది.

రూల్సుకికూడా—తెలుగుమాస్టారంటే వేళాకోళమే.

"కావాలంటే మరోప్లేటు తెస్తాడులెండి— బిల్లు వెయ్యకుండా—" ప్రొప్రయిటరు వచ్చి అన్నాడు.

మాస్టారి ముఖంలో కత్తివేటుకి నెత్తుటిచుక్కలేదు.

"నేను ముష్టివాణ్ణికాను."

"అదికాదు—"

"మీరు ఊరికే—దయాధర్మంగా నాకు టిఫిను పెట నవసరంలేదు. "డబ్బులు కౌంటరుమీద పెట్టి—వెళ్లిపోయారు.

అలినాడు — అవమానించబడిన యుగంధరుడు — మాస్టారిలా ఉండేవాడా ? అనిపించింది.

నాకు తెలుసు.

ప్రొప్రయిటరు క్లీనర్నేమీ అనలేదు. మందలించలేదు.

సర్వర్స్ యూనియన్. క్లీనర్ల యూనియన్...ఎక్కడచూసినా యూనియన్లు. విద్యుక్తధర్మంనుంచీ, కనీస సభ్యతా ప్రవర్తనమంచీ అధిగమించి అతీతులు కావడానికి ఎనలేని కృషి చేసే యూనియన్లు ! యూనియన్ బలంచూసుకునే మాస్టారిపట్ల పొగరుమోతు తనంగా ప్రవర్తించాడు హోటల్ క్లీనరు.

కస్టమర్‌తోపాటు ప్రొప్రయిటరుకూడా నిస్సహాయుడే!

పరుగు పరుగునవెళ్లి పిలిచాను మాస్టార్ని.

పిలుపందలేదో, అందినా అన్యథా భావించారో, తెలుగు మాస్టారు పలకలేదు !

ఆయనకు ఒకప్పుడు నేను అత్యంత ప్రియతమ శిష్యుణ్ని.

నన్నే మరచిపోయారా మాస్టారూ ?

ఎంత దురదృష్టవంతుణ్ణి!

3

తెలుగు మాస్టారికీ అభిమాన విషయాలుంటాయి.

కొన్ని సరదాలు—తమాషా ఐనవి ఉంటాయి.

మా తెలుగు మాస్టారూ అంతే.

పరీక్షలు రాకుండానే మా మార్కులు తెలిసిపోయేవి.

ఎలా అంటే—

మా తెలుగుమాస్టారు సంగీతప్రియులు.

సంగీతమంటే—శ్రావ్యమైన సంగీతం.

సాహిత్య పరమైన సంగీతం !

మాతెలుగు వాచకంలో పద్యభాగంలో—భాగవతంలోవీ, భారతంలోవీ, రామాయణంలోవీ, నైషధంలోవీ, అలా ఎన్నో రకాల పద్యాలుండేవి.

మాస్టారు పాఠం చెప్పే పద్ధతి సరదాగా ఉండేది.

ఆయన కంఠం శ్రావ్యంగా ఉండదు.

పద్యాలు వల్లెవేసినట్లుకాక స్వరరాగయుక్తంగా చదివితే ఆయన—జోలపాటకి నిదురించే పసిపాపే అయిపోయేవారు.

అదృష్టవశాత్తూ నాగొంతు మధురంగా ఉండేది. సంగీత జ్ఞానం లేకపోయినా—మాయింటి వెనుక నాటకాల రిహార్సల్స్ జరిగేవి కనుక రాగయుక్తంగా పద్యం చదవగలిగే వాడిని. అందుచేత—మాస్టారికి నేను ప్రియ శిష్యుణ్ని. పేపరెలాగ వ్రాసినా ఫస్టుమార్కునాదే. నాఅంత మధురంగా మరెవరూ పద్యాలు పాడ గలిగేవారు కారుగా ! ఈవిధంగా—పద్యాలు చదవగలగడం అనే అంశాన్నాధారంగా చేసుకుని—పేపర్లకు మార్కులు వేసేవారు తెలుగు మాస్టారు.

ఈ పద్ధతి అన్యాయం అని ఒకరిద్దరు కుర్రాళ్లంటే...

"నిజమైన విద్య కాగితాలమీద కనపడదురా. మనిషిలో ఉంటుంది. మునపటి చదువులెలా ఉండే వనుకొన్నారు ? పుస్తకాలు చూసి చదవడంకాదు. గురువుగారు నోటిని పాఠం చెబుతూంటే శిష్యులు వల్లెవేసేవారు. అంతే, విద్య అలాగే వ్యాప్తి చెందేది. మనిషిలోనూ మెదడులోనూ నిక్షిప్తమై ఉండేది ఏవిద్య అయినాసరే. మరొక మాటరా అబ్బాయిలూ. సాహిత్యానికి సత్తువనిచ్చేది స్వరం. స్వరం అంటే సంగీతం.

ఉట్టుట్టి అక్షరాలు ప్రాణ రహితాలు. సంగీతం—సాహిత్యానికి ప్రాణంపోస్తుంది. ఉచ్చారణ ననుసరించి ఒకే మాటకు వేర్వేరు ప్రభావాలు కల్పించవచ్చు. అందుచేత—సాహిత్యంకంటె సంగీతమే మిన్న.

వేదాలున్నాయి చూశారూ—"

"చూడలేదు మాస్టారూ—"

"ఔనులే. వేదాలను చూడగలిగే కళ్లు మీకెక్కడివి ?—వేదాలు అచ్చుపుస్తకాల్లో ఉండేవికావు. గురువుల కంఠాలలో ఉండేవి. సరి అయిన శ్రుతిలో చదివితేనే వాటిబలం. సామవేదం మచ్చు చూపుతాను. వినండి—"

మాస్టారు సామవేదం అందుకున్నారో — మేమంతా మంత్రముగ్ధులమయిపోయామన్నమాటే. అసలు—సామవేదం సంగీత ప్రధానమట. శ్రుతి, లయ, రాగం, తాళం—అన్నీ జతచేసి—ఎంత అద్భుతంగా చదివేవారు మాస్టారు! మంత్రంకూడా సరిగ్గా జపిస్తేనే తంత్రం ఔతుందట.

మాస్టారు చెప్పినదంతా నిజమే అనిపించేది—ఆయన వేదమో పనసో, అమరమో, శ్లోకమో చదివారంటే. ఆయన—అవి చదువుతూ మమ్మల్నేవో కొత్త (పాత ?) లోకాలలోకి తీసుకు పోయేవారు.

మాస్టారు—తెలుగు మాస్టారవదామని అనుకోనేలేదట.

ఏవరో దివాను—సంస్కృత పండితులని కాస్తా తెలుగు మాస్టారిగా మార్చేశారట. భుక్తి కోసం—మాస్టరు గిరీని పట్టుకు వేలాడుతున్నారు. ఇంగ్లీషురాదు కనుక—లెక్చరర్ గ్రటా కాలేదుకానీ లేకపోతే విశ్వవిద్యాలయంలో పనిచేయవలసినంత ప్రజ్ఞాశాలే మా మాస్టారు.

అంతెందుకు? ... ఓ కొంటికుర్రాడు కోరగా—తద్దినం మంత్రాలు పఠించారు మాస్టారు. వింటూ—కిక్కురుమంటే ఒట్టు. మా మాస్టారు తద్దినాలు కూడా పెట్టించగల సమర్థులే పెద్ద వాళ్ళ యిళ్లల్లో తద్దినాలకు వెళ్లేవారు కూడా!

చెప్పవచ్చేదేమంటే-సంగీత రసజ్ఞులైన మా మాస్టారు—కుర్రాళ్ళు పద్యం చదివే తీరుననుసరించే మార్కులు వేయడం—ఏంతయినా సముచితమే అని. ఇనస్పెక్టరు వచ్చాడంటే—క్లాసులో నా చేత పద్యం పాడించకుండా వదిలేవారా! ఉత్సాహంలో ఆయన కూడా మాంచి పద్యం చదివేవారు—ఇనస్పెక్టరు డంగయిపోయేలా

ఆ కాలంలో—ఏంచేతనో కాని—స్కూళ్ళ యినస్పెక్టర్లు కూడా సాధారణంగా బ్రాహ్మల్లై ఉండేవారు. వాళ్ళు—మా తెలుగు మాస్టారింటనే భోజనం చేసేవారు. ఉప్పూ పప్పూ—మేమూ, హెడ్ మాస్టరూ సమకూర్చేవారం.

తరువాత—"ఇనస్పెక్టరుగారు భోజనం బాగా చేశారా?" అని మేమడక్కుండా ఉండలేకపోయేవాళ్ళం. మా తెలుగు మాస్టారు చక్కని కథకులు. చెప్పదలుచుకున్న విషయాన్ని—ఎదటివారి హృదయాలకు హత్తుకుని జీవితాంతమూ మరచిపోలేనంత బాగా చెప్పేవారు.

"ఒకానొక బీద బ్రాహ్మణుడుండేవాడ రా అబ్బాయిలూ! పాపం...అతనికి—ఎవరింట్లోనో తద్దినం ఐతే తప్ప భోజనం దొరికేది కాదు. అనాడు మాత్రం అతనికి కడుపు నిండేది. ఒకసారి—దేముడు కనికరించక—వారాల తరబడి తద్దినపు పిలుపు రాలేదు. ఏదో ముష్టెత్తుకున్నా—అతని కడుపు కొంకమూలకి వచ్చేవి కావు.

రాక రాక—తద్దినపు పిలుపు వచ్చింది.

ఆహ్వానం అందుకుని—తరలి వెళ్లాడు.

అతనికి వడ్డించలేక—ఆ యిల్లాలి చేతులు నొప్పెట్టాయి; నడుం పీకింది.

విట్టకేలకు ఎలా ఐతేనేం, ఆ బ్రాహ్మణుడు భోజనం ఐందనిపించి—త్రేన్చి—లేచాడు.

అతని పొట్టముడతలలోంచి — రెండు సాలెపురుగులూ, ఓ తేలూ, మూడు బొజ్జింకలూ—వచ్చిన నే-రాలిపడ్డాయి. అది చూసిన యిల్లాలి కళ్లు ఆనందంగా మెరిశాయి."

మాస్టారు మౌనం దాల్చేవారు.

అంటే అర్థం-కథ ఐపోయిందని!

మాస్టారు కథ చెప్పడంలో ఎంత చక్కని టెక్నిక్!

మేము నవ్వలేదంటే—మాస్టారికి తెలిసిపోయేది మా బుర్రలకి కథ అర్థం కాలేదని.

కొన్ని నిముషాలాగి-అప్పటికీ మేము మౌనంగానే ఉంటే—నీరసంగా వివరించేవారు—అరసికేషు కవిత్వ నివేదనం శిరసి మాలిఖ మాలిఖ మాలిఖ అని బాధపడుతున్నట్టుగా.

"ఆకలితో ముడతలు పడిన కడుపు. ఎంతలోతు ముడతలంటే తేళ్ళూ, సాలెపురుగులూ నివాసం ఏర్పరచుకునే అంత! ఆ యిల్లాలు పెట్టిన భోజనంలో—కడుపు ముడతలువిడి—సాలెపురుగు, తేలూ బయటపడ్డాయి. అంటే—అంత నిండుగా భోజనం చేశాడన్నమాట. భోక్త సుష్టుగా తింటేనే—వండి వడ్డించిన యిల్లాలికి తృప్తి, ఘనతా. ఇప్పుడర్థమైందా?"

కథలను కూడా బోధించేవారు మా మాస్టారు.

అందుకే ఎంతవయస్సు వచ్చినా తెలుగు మాస్టారినీ, వారి కథాకథన చాతుర్యాన్నీ మరచిపోలేకపోవడం.

తెలుగు మాస్టారిలో ఎంత సహృదయత!

తాను చక్కని గాయకులయినా—కుర్రాళ్ళలోని మిడి మిడి గాయకులని మనస్ఫూర్తిగా ప్రోత్సహించేవారు. పిల్లలు బాగా పద్యం చదువుతూ ంటే—ఆనందంతో తల ఊపేవారు.

· శిశుర్వేత్తి, పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిః

సంగీత కళని సాహిత్యం కంటె మరొక మెట్టెక్కించడంలో తప్పేముంది? రాగయుక్తంగా చదవకపోతే ఋగ్వేదమయినా రాణించదట

నిజం మాస్టారూ. నిజం.

4

మనం గమనించం కానీ—మన జ్ఞానానికంతటికీ మూల బీజాలు తెలుగు క్లాసులోనే పడివుంటాయి.

మిగిలిన మాస్టర్లలా కేవలం పాఠం మేరకు చెప్పి చేతులు దులిపేసుకోరు తెలుగు మాస్టారు.

జీవితం గురించి పాఠాలు బోధిస్తారు.

జీవిత సత్యాలు బోధిస్తారు.

జీవితంలోని—రసం, నరసం, విరసం—అన్నీ పిల్లల చెవుల్లో నూరిపోస్తే తప్ప నిద్రపట్టదు తెలుగు మాస్టారికి అజ్ఞానులం కనుక వారి శ్రమని మనం ఛాదస్తంగా తీసుకుని నవ్వుకుంటాం.

"శ్రద్ధగా చదువుకుని బాగుపడరా!"

ఇదేమాట మిగిలిన మాస్టర్లూ చెప్పొచ్చు. కాని—

తెలుగు మాస్టారు చెప్పేతిరులో ప్రత్యేకత.

స్వంతకొడుకు పాడైపోతూంటే ఎంత బెంగపడుతూ చెప్తారో తన విద్యార్థి చదవకపోతే కూడా అంత దిగులూ పడుతూ నీతులు చెప్తారు.

బాగుపడమని బ్రతిమాలుకుంటారు.

అవసరమయితే—భయపెడతారు కూడా!

అంత ఆప్యాయత—తెలుగు మాస్టారికే చెల్లింది. మిగిలిన వాళ్ళు చెప్పే నీతులకంటె—తెలుగు మాస్టారుచెప్పే నీతులకి శక్తి ఎక్కువ. తెలుగు మాస్టారు చెప్పే జీవన సత్యాలు నిత్యాలే.

ఒకసారి—మార్కులు కనుక్కుందుకుని వారింటికి వెళ్లాను.

ముఖం చూస్తూనే నేనెందుకు వచ్చానో పసిగట్టేశారు.

పిల్లల మనస్తత్వం—తల్లితండ్రులకి తెలియకపోవచ్చునేమో కాని తెలుగు మాస్టారికి తెలియకుండా ఉండదు.

"అరవై రెండు చాలా?" నవ్వారు వారు.

నమస్కరించి శలవు తీసుకోబోయాను.

"ఆగరా అబ్బాయ్..."

ఆగాను.

"నువ్వు కొన్ని మర్యాదలూ, మన్ననలూ నేర్చుకోవాలిరా."

ఆయనవంక చూశాను.

"కార్యార్థియైనవాడు రిక్తహస్తాలతో చేరకూడదు. కృష్ణ పరమాత్మవద్దకు వెళ్లిన కుచేలుడు—చివరకి అటుకులయినా తీసుకు వెళ్లడంలో అంతరార్థ మేమిటంటావ్?"

"......"

"సంప్రదాయం. అంతే. అది లంచంకాదు సుమా!...పెద్దల దగ్గరకీ, గురువులవద్దకీ, పసిపాపలవద్దకీ వెళ్లేటప్పుడు వొట్టి చేతులతో వెళ్లకూడదు. కాయో, పండో...శక్తిమేరకు విదుటివాళ్ల చేతిలో పెట్టాలి—"

"క్షమించండి మాస్టారూ!"

"అంతమాటెందుకురా!...నువ్వంటే ఏమిటో అభిమానం. నాకు తెలిసినదంతా నీకు నూరిపోసెయ్యాలనిపిస్తుందంతే. సరే... వెళ్ళు."

సిగ్గుపడుతూ కదలబోయాను.

వెనక్కి పిలిచి మరోమాట చెప్పారు.

"శోభనం గదిలో—వధువు కొంగుని వరుడు బంగారు కాసెందుకు కడతాడో తెలుసా?"

అడ్డంగా తలూపాను.

"వధువుని డబ్బుపెట్టి కొనుక్కోమని కాదుసుమా! కేవలం వరుడు వధువునట్ల తనకుకల విలువని ప్రకటించడంకోసం. బహుమతులకి విలువే తప్ప ఖరీదు లెక్కలోకి రాదు. మరచిపోకు."

తల ఊపి వచ్చేశాను.

ఆనాడు మాస్టారు చెప్పిన మాట పాటించడంవల్ల నా కనేక లాభాలు కలిగాయి. మంచీ, మర్యాద తెలిసిన మనిషి వనిపించుకో గలిగాను. నన్ను మనిషిని చేసింది తెలుగు మాస్టారు కాక మరెవరు?

[ఇంకా వుంది]

వర్షా సంధ్య

సాంధ్యశ్రీ

వాన
కురిసి కురిసి
అలసి వెలిసి ...
కాల నిశ్వాసం లా
గాలి క్షణం
చూడు బారు
బొట్లు బొట్లు కారు
చేతు లెత్తిన
చెట్లు చేమల
ఆకు నాకున జాలి భయం....

పుట్ట లోపలి
చీమ లన్నీ
ఒక్కటొక్కటే
విశ్వబ్బపు తొందరలో....
ఏ కాకి లేని
ఆకాశం
ఏ కాకి...!
పాయం ముఖాన
గాయం...,
చినుకు బాణం చురుకున

నేల
నీటి పాయల
వేల వేల
నెత్తు చుక్కలు....
సూదిగా-సూటిగా కంటిలో...!
జాలిలో
తడిసి చివికిన
సగం మునిగిన
కాగితపుడవ జరుగులో
సగం విరతి - సగం
దిలితి.